ప్రజాశక్తి

బుధవారం 14 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఫలించిన వైసిపి వ్యూహం

◆ బొత్స ఎన్నిక లాంఛనమే..! ◆ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో టిడిపికి ఓటమి భయం

◆ అందుకే చివరి నిమిషంలో పోటీకి దూరం

వైసిపి మాజీ మంత్రులు, నాయకులతో కలిసి నామినేషన్ వేసేందుకు వచ్చిన బొత్స (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసిపి వ్యూహం ఫలించింది. తమ సంఖ్యా బలం పెంచుకోలేమని తెలిసి టిడిపి కూటమి పోటీ నుంచి తప్పుకుంది. స్థానిక సంస్థల వైసిపి ప్రజా ప్రతినిధులకు డబ్బులిచ్చి తమ వైపు తిప్పుకోవడానికి సోమవారం వరకు టిడిపి తీవ్ర ప్రయత్నం చేసింది. 841 మంది ప్రజా ప్రతినిధుల ఓటర్లలో 600 వైసిపికి వున్నాయి. మిగిలినవి కూటమికి వున్నాయి. కూటమి ఓట్లను పెంచుకొనేందుకు బేరసారాలకు టిడిపి సిద్ధపడింది. అయితే, వైసిపి ప్రజాప్రతినిధులు బయటలేకపోవడంతో చేసేదిలేక టిడిపి చతికిలపడింది. తమ ప్రజా ప్రతినిధులు కూటమి నాయకత్వాన్ని చిక్కకుండా వైసిపి ముందుగానే శిబిరాలకు తరలించింది. ఆ తరలింపుతో బేరసారాలకు టిడిపికి ఆస్కారం లేకుండాపోయింది. దీంతో అభ్యర్థిని పోటీలో పెట్టినా గెలవగలిగిన సంఖ్యలేదని గుర్తించి నామినేషన్ల గడువు చివరిరోజు మంగళవారం ఎన్నికల్లో కూటమి పోటీచేయడం లేదని ప్రకటించాల్సి వచ్చింది. దీనికి ముందు అనేక చర్చోపచర్చలు, వాదోపవాదాలు కూటమిలో సాగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయాలని టిడిపి కుతూహలం ప్రదర్శించింది. వైసిపి ప్రజాప్రతినిధులు ప్రవాహంలా టిడిపిలో వచ్చిచేరుతారని ఊహించారు. అందుకని ఎమ్మెల్సీ పోటీ ఆశావహులు పెరిగారు. పదవిపై ఆసక్తి చూపిన పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జి, పివిజి.కుమార్, బత్తుల తాతయ్యబాబు పేర్లను టిడిపి అధినేత చంద్రబాబు పరిశీలనకు పంపారు. వీరెవరూ కోట్ల రూపాయల డబ్బు ఖర్చు పెట్టడానికి ముందుకురాకపోవడంతో బైరా దిలీప్‌చక్రవర్తి పేరు తెరమీదకు తెచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీచేసే అవకాశంరాని దిలీప్ చక్రవర్తిని ఎమ్మెల్సీగా పోటీలో పెట్టాలని చంద్రబాబు మిగతా 2లో..

భారీ ర్యాలీలో సిహెచ్.నర్సింగరావు, ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

సమస్యలు పరిష్కరించాల్సిందే..

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల భారీ ధర్నా

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా జరిగింది. తొలుత స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు ప్రధాన రహదారిపై వేలాది మంది కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఆందోళన కొనసాగించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చిత్తశుద్ధితో కృషి చేయాలని, కర్మాగారానికి ప్రభుత్వం సరిపడా ముడి సరుకు, నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఏడో తేదీ లోపున జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ లేని కార్మికులకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్‌జెసిఎస్‌లో పెంచిన రూ.1200ను వెంటనే కార్మికులకు చెల్లించాలని, కార్మికులను తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కార్మిక శక్తిని తక్కువ అంచనా వేసిన ప్రభుత్వాలు తోక ముడుచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

ప్రజా పంపిణీ పథకంలో అక్రమాలను సహించేది లేదు

▶ వార్త 2లో..

హత్యను ఖండిస్తూ వైద్య విద్యార్థుల భారీ ర్యాలీ

▶ వార్త 2లో..

మాధవస్వామి ఆలయంలో చోరీ

▶ వార్త 3లో..

పేదలకు వైద్యాన్ని దూరం చేయడం దారుణం

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : పేదలకు రాష్ట్ర ప్రభుత్వం వైద్యాన్ని దూరం చేయడం దారుణమని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని తెలియజేశారని, దీనికి ముద్దుగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) అని పేరు పెట్టారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఆసుపత్రుల నిర్మాణం చేస్తామని హితబోధించారన్నారు. అయితే, ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆసుపత్రులను సక్రమంగా నడపకలేకపోతున్నారని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో లేక రోగులు అనేక మిగతా 2లో..

హైదరాబాద్ - సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వాతంత్ర్య దినోత్సవం / వారాంతపు సెలవుల అదనపు రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ - సంత్రాగచ్చి - హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఆ మేరకు 07069 హైదరాబాద్ - సంత్రాగచ్చి ప్రత్యేక రైలు ఆగస్టు 14వ తేదీ ఉదయం 05:30 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి సాయంత్రం 19:30 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 19:32 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12:00 గంటలకు సంత్రాగచ్చికి వెళ్తుంది. 07070 సంత్రాగచ్చి -హైదరాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 15వ తేదీ మధ్యాహ్నం 15:50 గంటలకు సంత్రాగచ్చి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 05:38 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 05:40 గంటలకు బయలుదేరి 17:30 గంటలకు హైదరాబాద్‌కు వెళ్తుంది.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జివిబి నందాజీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం జివిఎంసి పరిధిలోని పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విశాఖ డివిజన్ - 3 ఫుడ్ సేఫ్టీ అధికారి జివి అప్పారావు ఆయా హోటళ్లను కలియదిరిగారు. పాత జైలు రోడ్డు, రాంనగర్ ప్రాంతాల్లో ఉన్న ఇన్నోసెంట్ బ్యాచిలర్ ఫ్యామిలీ రెస్టారెంట్, గ్రీన్ వ్యాలీ రెస్ట్రో కేఫ్‌లలో సుమారు 10 కిలోల నిల్వ ఉంచిన, పాడైపోయిన ఆహార పదార్థాలను, చికెన్, మసాలా పేస్ట్, లాలీపాప్‌లను గుర్తించి ఆయా హోటళ్లపై కేసులు నమోదు చేశారు. ఆ పదార్థాల విలువ సుమారు రూ.10 నుండి రూ.12 వేల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. పదార్థాలు వినియోగానికి పనికిరానందున, దుర్వాసన వస్తున్నందున తదుపరి విచారణ అనంతరం ఆ హోటళ్లపై జరిమానా విధిస్తామని తెలియజేశారు.

అవయవదానానికి ముందుకురండి

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఒకరి అవయవ దానంతో కొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చుని, కావున అపోహలు విడనాడి అవయవ దానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ విశాఖ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర జీవన్‌దాన్ ఆధ్వర్యంలో అవయవదాన అవగాహనా కార్యక్రమం సిరిపురంలోని వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో మంగళవారం ఉదయం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది అవయవాల కోసం నిరీక్షిస్తున్నారని, అంతమందికి అవయవాలు లభించకపోవడానికి ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడమే కారణమని అన్నారు. అవయవదానంతో ఎటువంటి నష్టమూ ఉండబోదనే అభిప్రాయానికి ప్రజలు రావాలని ఆకాంక్షించారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబ సభ్యుల పూర్తి అంగీకారంతో మాత్రమే అవయవాలను తీసుకుంటారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఇతరులకు అవయవాలను అమర్చుతారని స్పష్టం చేశారు. డబ్బులు చెల్లిస్తే అవయవాలు లభిస్తాయనే దళారుల మోసపూరిత ప్రలోభాలకు గురికావద్దని హితవు పలికారు. భవిష్యత్తులో అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, తద్వారా మరింత మెరుగైన వైద్యం అందించి, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఫలించిన వైసిపి వ్యూహం

భావించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టడానికి చక్రవర్తి సిద్ధపడ్డంతో ఆయన్ను బరిలో పెట్టాలని కూటమి ఏకాభిప్రాయానికి వచ్చింది. వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భారీగా టిడిపిలో చేరుతారని అతి అంచనాతో అభ్యర్థిని గెలిపించి అప్పగించే బాధ్యత తమదని కొంతమంది ఎమ్మెల్యేలు చంద్రబాబు ముందు ప్రగల్భాలు పలికారు. ఈ మాటలు నమ్మలేని చంద్రబాబు వాస్తవ బలాన్ని అంచనావేసి నివేదిక ఇవ్వాలని ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించారు. అభ్యర్థిని పోటీలో పెడితే గెలుస్తామన్న విశ్వాసాన్ని కమిటీ చెప్పలేకపోయింది. మంగళవారం టిడిపి నాయకుల అభిప్రాయాలను చంద్రబాబు తీసుకున్నారు. స్థానిక సంస్థల వైసిపి ప్రజా ప్రతినిధులు ఫోన్‌కు కూడా దొరకడంలేదని ఎమ్మెల్యేలు చెప్పినట్లు తెలిసింది. తమ సంఖ్య తక్కువ వున్నప్పుడు పోటీ చేయకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి టిడిపి నాయకత్వం వచ్చింది. పోటీ చేసి ఓటమిపాలవడం కంటే, పోటీలో లేకపోవడమే గౌరవప్రదంగా వుంటుందని భావించింది. పోటీలో కూటమి లేకపోవడంతో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఎన్నిక లాంఛనప్రాయమైంది.

స్థానిక సంస్థల బరిలో ఇద్దరే..

నామినేషన్ల ఆఖరు తేదీ 13 నాటికి వైసిపి నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా పెందుర్తి సమీపంలోని గణబాబు కాలనీలో ఉంటున్న షఫీ ఉల్లా మాత్రమే నామినేషన్ వేశారు. షఫీ ఉల్లా 2019 ఎన్నికలలో పెందుర్తి అసెంబ్లీ నియోజవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఆయన నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశముందని భోగట్టా. ఇదిలా ఉండగా బుధవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఆ సమయంలో పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాకుండా ఆమోదం పొందితే, పరిశీలన అనంతరం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అప్పుడు కూడా పోటీలో ఈ ఇద్దరు అభ్యర్థులు ఉంటే పోటీ అనివార్యమవుతుంది.

అవయవదానానికి ముందుకురండి

మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎక్కువ మంది దాతల నుంచి అవయవాలను సేకరించిన కిమ్స్ ఐకాన్, కేర్ ఆసుపత్రి యాజమాన్యాలను, బ్రెయిన్‌డెడ్ అయి అవయవాలను దానం చేసిన విపిన్ మెహతా, సిహెచ్.భవాని, ఆర్.రామలక్ష్మి, కె.పవన్ కుమార్, వి.శ్రీనివాసరావు, ఎస్.లలిత కుటుంబ సభ్యులను జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, రాష్ట్ర జీవన్‌దాన్ సమన్వయ కర్త డాక్టర్ కె.రాంబాబులతో కలిసి కలెక్టర్ ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్ర జీవన్‌దాన్ సమన్వయకర్త, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. రాష్ట్రంలో మూడు వేలకు పైచిలుకు మంది అవయవాల కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. విశాఖలో 15 రోజుల నుంచి అవయవదానంపై అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో ఈ ఏడాదిలో 136 మందికి అవయవాలను అమర్చామని, ఇది శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ అవగాహనా కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ శివనాగేశ్వర రెడ్డి, ప్రముఖ ఆసుపత్రుల వైద్యులు, ఎన్‌జిఒలు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

పేదలకు వైద్యాన్ని దూరం చేయడం దారుణం

ఇబ్బందులు పడుతున్నారని లోకనాథం తెలిపారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వస్తే రక్తపరీక్షలు చేయడానికి పరీక్ష కిట్లు లేని స్థితి ఉందన్నారు. జ్వరాలతో పిల్లల దగ్గర నుండి పెద్దల వరకు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి ఆసుపత్రులను ప్రైవేట్ వారికి అప్పగిస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ విధానం అమలైతే పేదలు ఉచిత వైద్యానికి దూరమై వ్యయప్రయాసలకు గురై అనేక ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. వైద్యానికి కేటాయించాల్సిన బడ్జెట్‌ను కేటాయించకుండా టెలీ మెడిసిన్ పేరుతో వరల్డ్ బ్యాంకు నుండి రూ.2300 కోట్లు నిధులు తెస్తామని, కార్పొరేట్ స్థాయిలో సేవలందిస్తామని ప్రకటించారన్నారు. పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో గ్రామాల్లో బ్లీచింగ్, దోమల నివారణకు పాగింగ్ వంటి ప్రాథమిక చర్యలు కూడా చేయలేకపోతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉందన్నారు. ఏజెన్సీలో ఎవరు అనారోగ్యానికి గురైనా డోలీ మోతలతోనే వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నారని తెలిపారు. నేటికీ ఏజెన్సీ ప్రాంతంలో వందల కొలదీ గ్రామాలకు రోడ్డు కనక్టివిటీ లేదన్నారు. దీంతో ఫీడర్ అంబులెన్సులు కూడా వెళ్లలేని స్థితి ఉందన్నారు. ఫీడర్ అంబులెన్సులకు కూడా నిబంధనల పేరుతో నిధులు సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. దీంతో ఆ సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయని తెలిపారు. విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణిస్తే సుదూర ప్రాంతాలకు మహాప్రస్థానం వాహనాలు ఉచితంగా దొరకడం గగనమై పోయిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సమస్యలన్నింటినీ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి కేటాయించాల్సిన నిధులు కేటాయిస్తే మెరుగైన వైద్యం ప్రజలకు అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పిపిపి ఆసుపత్రులు ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడతాయో పున:పరిశీలన చేయాలని కోరారు.

వాల్తేర్ డివిజన్‌లో హర్ ఘర్ తిరంగా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ రైల్వే డివిజన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం నుంచి గురువారం వరకూ హర్ ఘర్ తిరంగా వేడుకలను చేపడుతున్నట్టు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నివాసితులు తమ ఇళ్లలో జాతీయ జెండాను ప్రదర్శించేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. దేశభక్తిని పెంపొందించడం, భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోవడం లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఉత్సవాలకు సన్నాహకంగా డివిజన్‌లోని అన్ని స్టేషన్ భవనాలను మూడు రంగుల లైట్లతో అలంకరించనున్నట్టు తెలిపారు.

జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ..

వైద్య విద్యార్థుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్ర మెడికల్ కళాశాల అధ్యక్షులు టి.పృథ్వీ డిమాండ్ చేశారు. జూడా హత్యను నిరసిస్తూ ఆంధ్ర మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్లు, వందలాది మంది వైద్య విద్యార్థులు మంగళవారం కెజిహెచ్‌లోని అన్ని అవుట్ పేషెంట్ విభాగాల్లో సేవలను నిలిపివేస్తూ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ డాక్టర్‌పై హత్యాచార సంఘటనను రాజకీయం చేయకుండా, బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలన్నారు. జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ పానగల్ భవనం నుంచి చేపట్టిన ఈ ర్యాలీ కెజిహెచ్ డౌన్ రోడ్డు, వాచ్ హౌస్, జగదాంబ జంక్షన్, జిల్లా కలెక్టర్ ఆఫీస్ మీదుగా ఆంధ్ర మెడికల్ కాలేజీ వరకూ సాగింది. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాపేటి ఊహ, కార్యదర్శి వై.రాజ్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

ఎ డే ఆఫ్ గ్రీట్ - మీట్ అండ్ ట్రీట్ ఫర్ సీనియర్ సిటిజెన్స్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలోనూ, అలాగే రాణి చంద్రమణి హాస్పటల్ ప్రాంగణంలోనూ మంగళవారం ఎ డే ఆఫ్ గ్రిట్, మీట్ అండ్ ట్రీట్ ఫర్ సీనియర్ సిటిజెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (విడిఎస్ సిడబ్ల్యూఎ), అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రం (ఎఎస్‌వికె) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. పోస్టర్‌ను విడిఎస్ సిడబ్ల్యూఎ ప్రెసిడెంట్ కె.మంగపతిరాజు, సెక్రటరీ జనరల్ డాక్టర్ పికె.జోస్, ఎవిఎస్‌కె నిర్వాహకులు ఎంఆర్‌డి.రాజు, డాక్టర్ కె.రమాప్రభ, విసిసి సీనియర్ సిటిజన్స్ భాస్కరదేవి, (రిటైర్డ్ ప్రొఫెసర్), సన్యాసి నాయుడు (రిటైర్డ్ జడ్జి), అడ్వకేట్ భారతి, కుమార మంగళం (ప్రభుత్వ రంగ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్), పాండురంగ (ఎల్‌ఐసి పెన్షనర్స్ అసోసియేషన్), డాక్టర్ శీతల్, సునీత, నరసింగరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు సీనియర్ సిటిజన్స్‌కు ఒక వేడుకగా నిలిచేందుకు, స్నేహాన్ని పెంపొందించేందుకు, వారిని శక్తివంతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 10వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు అకడమిక్, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు జరుగుతాయన్నారు. అకడమిక్‌లో పెయింటింగ్, పద్యాల పోటీలు, క్విజ్, మెమరీ టెస్ట్, స్టోరీ రైటింగ్, కవితలు రాయడం, కథ చెప్పడం, రోజువారీ వార్తాపత్రిక పఠనం, ఇంటర్నెట్ శోధన, ఉపన్యాసం ఉంటాయన్నారు. అలాగే ఫ్యాన్సీ డ్రెస్, సాంస్కృతిక కార్యక్రమాలలో గానం, మోనో యాక్షన్, దేశభక్తి గీతాలాపన, జానపద గీతాలాపన, పౌరాణిక పద్యాలు, శాస్త్రీయ నృత్యం, మిమిక్రీ, స్టాండప్ కామెడీ, వాయిద్య సంగీతం, నృత్యం అంశాలు పోటీలలో ఉంటాయని, విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ పార్టిసిపేట్ సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ప్రతి అరగంటకు లక్కీ డిప్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఎవరైనా పాల్గొనవచ్చునని, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్స్ సభ్యులను ప్రోత్సహించి పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పాల్గొనే వారు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం డాక్టర్ పికె.జోస్ (9440156638)ను, డాక్టర్ కె.రమాప్రభ (9492348428)ను సంప్రదించాలని కోరారు.

ప్రజా పంపిణీ పథకంలో అక్రమాలను సహించేది లేదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లాలో ప్రజా పంపిణీ పథకంలో అక్రమాలను సహించేది లేదని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. జిల్లాలో రేషన్ పంపిణీ విషయమై ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నందున రేషను బియ్యం పక్కదారిని నివారించేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులతో 12 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సరుకుల అక్రమ నిల్వ, అక్రమ రవాణా విషయమై ప్రజల వద్ద ఏమైనా సమాచారం ఉంటే కలెక్టరేట్‌లోగల కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 0891-2590100, 0891-2590102కు తెలియజేయాలని కోరారు.

వైసిపికి రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వడ్డాది రాజీనామా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రెల్లి వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, విశాఖ దక్షిణ నియోజవర్గం నాయకులు డాక్టర్ వడ్డాది మధుసూదనరావు వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం ఆయన మీడియాకు ఈ విషయాన్ని తెలియజేశారు. అనివార్య కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు.

IN THE HON'BLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: CHODAVARAM
O.S.No. 30 / 2023

Between:
Thamarana Narayana Murthy ...Plaintiff

And:
Denkada Gowramma and another ...Defendants

SUIT SUMMONS

To,
D-2 :
Nakka (Denkada) Krishna Veni
W/o. Thatharao, aged 45 years
Hindu, Housewife, Residing at
Bangarumetta Village,
Butchayyapeta Mandal
Anakapalli District.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you and another for Specific performance of contract to execute regular regd. Sale deed in his favour in terms of the sale agreement dated 11-03-2021 executed by you and D.1 in favour of the plaintiff in respect of the suit schedule property. You are hereby summoned to appear in the above court in person or through an advocate duly instructed and the matter stands posted to **06-09-2024 at 10-30 A.M.** for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the court.

K.BHASKAR DAS, Advocate,
Chodavaram. Cell : 9440042677

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM.
E.P. NO. 40/2023 IN DISPUTE NO. 494/2017

Between:
M/s. Margadarsi Chit Fund Private Limited, Miyapur Branch, Rangareddy Dist, Telangana State. Rep. by its Manager, K.Sridhar .. DECREEHOLDER

And:
M/s. Disha Interiors and 5 Others . . . JUDGEMENT DEBTORS.

PROCLAMATION OF SALE

Notice is hereby given that by an order of the Court named above the property of 3rd JDR (i.e. K.MURALI KRISHNA, S/o. K.RAMULU) mentioned in the schedule here under has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decreeholder mentioned in the above E.P for sum of **Rs.15,97,399/-** (excluding publication charges and battas) up to the date of sale in the aforesaid dispute against the Judgement Debtor mentioned above.

Public are hereby informed that the sale will be by public auction and the same will be held between **10-30 A.M. to 05.00 P.M. on 29-08-2024** at public court i.e. PRINCIPAL JUNIOR CIVIL JUDGE 'S COURT, BHEEMUNIPATNAM. At the sale the public are generally invited to bid either personally or by duly authorised agent subject to terms and conditions to sale which may be had from the counsel for the decree holder whose address particulars are furnished hereunder:

SCHEDULE OF PROPERTY
THE IMMOVABLE PROPERTY OF JDR 3:
All that piece & parcel of site admeasuring 54.65 Sq.yards or 45.69 Sq.Mtrs. being undivided and unspecified share out of 812 Sq.yards or 677.208 Sq.Mtrs together with a flat constructed upto slab level bearing Flat No. 403 measuring 1370 Sft. (including common areas and balconies) in the third floor and car parking measuring 100 Sft. in the stilt of "SIMHAGIRI ENCLAVE" in Plot No.13 of Sirugudi Nagar layout, covered by Patta No.278, Survey No.51. of Yendada Village, with the limits of Greater Visakhapatnam Municipal Corporation, in the registration sub district of Madhurawada, Visakhapatnam and bounded as follows:-

BOUNDARIES OF FLAT NO.403 IN 3rd FLOOR:-
NORTH: SET BACK OPEN SPACE,
SOUTH: STAIRCASE, OPEN SPACE AFTER THAT FLAT NO.402,
EAST: SET BACK OPEN SPACE,
WEST: SET BACK OPEN SPACE.
DHR VALUE :
FA'S VALUE :- Rs.25,00,000/-
JDR VALUE : Not furnished as the Jdr did not furnish the same.

PPS ASSOCIATES,
P MURALI GOPAL, Y SUJATHA,
J.V.PREMA SAI, ADVOCATES,
D.NO.49-19-20, LALITHANAGAR,
VISAKHAPATNAM 550 016.
Cell: 98483 20248. 97018 62649, 98486 95558.

పశువైద్యం దూరాభారం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలంలోని కొవ్వాడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పశువైద్యశాల చాలా గ్రామాల రైతులకు దూరాభారమవుతోంది. అనంతవరం జంక్షన్ నుంచి పెంట, కొవ్వాడ మీదుగా పోవు రహదారిలో కొవ్వాడ గ్రామాన్ని ఆనుకొని పశు వైద్యశాల ఉంది. నిర్వహణ సరిగా లేక ప్రస్తుతం ఈ పశువైద్యశాల నాచు పట్టి ఉంది. కె.కొవ్వాడ, పి.కొవ్వాడ, పెంట, అనంతవరం, గొల్లలపాలెం, గంధవరం, తిమ్మాపురం గ్రామాలతో పాటు విజయనగరం జిల్లా సరిహద్దుల్లో ఉన్న నారాయణపురం, పెదరావుపల్లి, చిన్నరావుపల్లి గ్రామాల నుంచి ఈ పశువైద్యశాలకు రైతులు పశువులను వైద్యం నిమిత్తం తీసుకొస్తుంటారు.

కె.కొవ్వాడ పశు వైద్య కార్యాలయానికి అనంతవరం, పెంట, గొల్లలపాలెం, గంధవరం, తిమ్మాపురం గ్రామాల రైతులు పశువులను తీసుకురావాలంటే 5 నుంచి 6 కిలోమీటర్ల నడిచి రావాల్సి ఉంది. ఇంత దూరం పశువులను తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల్లో పాడి రైతులకు గోపాలమిత్ర సేవలే అందుబాటులో ఉంటున్నాయి. ఎద కట్టే ఇంజక్షన్, చిన్నచిన్న రోగాలకు మాత్రమే వారు వైద్యం అందిస్తుంటారు. పెద్ద జబ్బులేమైనా వస్తే పశువైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కె.కొవ్వాడ పశు వైద్యశాల పరిధిలో ఉన్న అనంతవరం, గంధవరం గ్రామాల జనాభా సుమారు 8000 మంది ఉన్నారు. పశువులు నాలుగు వేలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ గ్రామాల్లో మినీ పశువైద్యశాలను ఏర్పాటు చేసి పశువులకు వైద్యం అందించాలని రైతులు కోరుతున్నారు.

కొవ్వాడలోని పశువైద్య కేంద్రం

భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా గోపీచంద్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.గోపీచంద్ నియమితులయ్యారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ఆయన భాద్యతలు చేపట్టారు. ఇతను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫీస్‌లో మార్కెట్ వా ల్యూ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ బదిలీపై భీమిలి వచ్చారు. 2022 జూన్ 22 నుంచి భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వి.తులసీదాస్ సోమవారం సస్పెన్షన్‌కు గురయ్యారు. వివిధ అభియోగాలపై విచారణ జరిపిన మీదట ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

బాక్సింగ్ పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన హర్యానాలోని రొహతక్‌లో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన జాతీయ బాక్సింగ్ పోటీల్లో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో గ్రామీణ ప్రాంత నేపథ్యం ఉన్న విద్యార్థులు పలు పతకాలు సాధించారు. మండలంలోని టి.నగరపాలెం గ్రామానికి చెందిన కె నీలిమ, అన్నవరం గ్రామానికి చెందిన వాసుపల్లి అజయ్, సిహెచ్ సూర్య ప్రకాష్, చిప్పాడ పంచాయతీ సిటీ నగర్‌కు చెందిన కె.వంశీ స్వర్ణ పతకాలు సాధించారు. వీరంతా హై స్కూల్, ఇంటర్ , డిగ్రీ విద్య అభ్యసిస్తున్నారు. సిల్వర్ మెడల్ సాధించిన వారిలో అన్నవరానికి చెందిన వి.శివరామ్, ఎం.యోగితేజిని, ఎం.వరుణ్, వి.ఆకర్ష్, సిటీ నగర్‌కు చెందిన కె జ్యోత్స్న, చిట్టివలసకు చెందిన డి.చంద్రమౌళి ఉన్నారు. వీరంతా 7, 8, 9,10 తరగతులు, ఇంటర్ చదువుతున్నారు. రజతం సాధించిన వారిలో జీరుపాలేనికి చెందిన ఎన్.లితిష్‌రెడ్డి, నమ్మివానిపాలేనికి చెందిన కె.సుష్మిత, సిటీ నగర్‌కు చెందిన కె.ఆదిలక్ష్మి, తగరపువలసకు చెందిన ఎల్.వికాష్, భోగాపురం మండలం గుడివాడకు చెందిన పి.హేమంత్‌సాయి కుమార్ ఉన్నారు. వీరంతా 7, 8, 9, 10 తరగతులు చదువుతున్నారు. అన్నవరం గ్రామానికి చెందిన కోచ్ వాసుపల్లి ఆదినారాయణ వివరాలు తెలిపారు. అతని శిక్షణలో వీరంతా పతకాలు సాధించారు.

స్వర్ణం సాధించిన విద్యార్థులు వీరే...

దబ్బందలో న్యాయవిజ్ఞాన సదస్సు

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న వెంకటశేషమ్మ

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ఎస్ఎ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ న్యాయపరమైన హక్కులు కలిగి ఉన్నారని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో విద్య, వైద్యం, మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్యవివాహాలను రూపుమాపాలని కోరారు. మహిళపై దాడులను అరికట్టడానికి న్యాయస్థానం ముందుంటుందన్నారు. ఇటువంటి సమస్యలైనా భయపడకుండా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజా సేవలకే పోలీస్ స్టేషన్లు ఉన్నాయన్నారు. మహిళలు స్వయం ఉపాధికి పెట్టే పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సుబ్రమణ్యం, తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఎస్ఐ సంతోష్, గ్రామ సర్పంచ్ బాలిరెడ్డి మల్లికార్జునరావు, ఆర్ఐ.మణికంఠ, గ్రామ పెద్దలు డోల మరిడిబాబు, దేవుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరములో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు, ఆరోగ్య పర్య వేక్షకులు కృష్ణమోహన్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఎసిఎస్ సభ్యుల వివరాలు కంప్యూటరీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : డివిజన్ పరిధిలోని 13 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఇప్పటికే ఉన్న సభ్యుల వివరాలను వారి ఆధార్‌కార్డుకు మొబైల్ నంబర్ అనుసంధానించేలా కంప్యూటరీకరణ చేయాలని డిఎల్‌డిఒ బి.లక్ష్మీపతి గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లను, వ్యవసాయ అసిస్టెంట్లను, పిఎసిఎస్‌ల సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎండిఒ కార్యాలయంలో సంబంధిత ఉద్యోగులు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాలతో పాటు మధురవాడ, కొత్తపాలెంలో ఉన్న 13 పిఎసిఎస్‌ల ద్వారా ఇప్పటి వరకు రుణం పొందిన వారి వివరాలను మాత్రమే కంప్యూటరీకరణ జరిపారని, ఇక నుంచి అందులో ఉన్న సభ్యుల వివరాలను కూడా కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎండిఒ డాక్టర్ వి.జానకి, కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ రేఖ జ్యోతిర్మయి, విశాఖ డిసిసిబి, డిప్యూటీ జనరల్ మేనేజర్ అప్పలరాజు, సిబ్బంది వెంకట అప్పారావు, ఇఒపిఆర్‌డి జి అప్పలరాజు పాల్గొన్నారు.

భారీ త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు భారీ త్రివర్ణ పతాకంతో పట్టణ పుర వీధుల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ గంట స్తంభం, మెయిన్ రోడ్డు మీదుగా బీచ్ రోడ్డులో ఉన్న శాఖా గ్రంథాలయం వరకు సాగింది. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ ర్యాలీలో ఎంఇఒ ఎం.శివరాణి, పాఠశాల హెచ్‌ఎం పి.రమణ, ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాస్, కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, ఉపాధ్యక్షులు కె.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి స్థానిక ఎస్‌సి, బిసి కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి రామారావు, మండల పరిషత్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు

భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీచేస్తున్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

మాధవస్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి -మాధవధార : అతి పురాతనమైన మాధవధార శ్రీ మాధవ స్వామి ఆలయంలో భారీ దొంగతనం జరిగింది. ఆలయ అర్చకులు సనపల వరాహ నరసింహస్వామి మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. స్వామివారి విగ్రహాలకు ఉండే బంగారం, వెండి ఆభరణాలు లేవు. దొంగతనం జరిగిందని గుర్తించి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారం వెండి ఆభరణాలతో పాటు సీసీ టీవీ, డివిఆర్ సుమారు రూ.10 లక్షలు వరకు అపహరణకు గురైనట్లు ఆలయ అర్చకులు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి క్రైమ్, సిసిఎస్ ఎసిపి ప్రసాద్, ఎస్‌బి ఎసిపి కె.ప్రభాకరరావు, క్లూస్ టీమ్‌తో తనిఖీలు నిర్వహించారు.

రేకుల షెడ్ పైనుండి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో దావత్ దాబాలో క్యాషియర్‌గా పనిచేస్తున్న గాజువాకకు చెందిన పంచదార్ల రామారావు (40) రేకుల షెడ్డు నుండి జారిపడి సోమవారం మృతి చెందారు. దావత్ దాబాలో ఉన్న రేకుల షెడ్డు పైనుండి నీరు కారుతుందని దాబా ఓనర్ జగదీష్, దాబాలో పనిచేస్తున్న జేమ్స్, ప్రసాదలతో కలిసి రామారావు రేకుల షెడ్ పైకి ఎక్కి సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి రామారావు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమైంది. వెంటనే కేజిహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారని డాక్టర్లు నిర్ధారించారు. మృతుని భార్య పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ బాల సూర్యారావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

విజయవాడ బయలుదేరిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

విజయవాడ తరలిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి -పద్మనాభం : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు పద్మనాభం మండలంలోని 22 గ్రామ పంచాయతీల నుంచి సుమారు 60 మంది ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, గ్రామ, మండల స్థాయి నాయకులు ఒక బస్సు, నాలుగు కారులపై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడకు బయలుదేరారు. ఎంపిపి రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణరావు ఆధ్వర్యాన తరలి వెళ్లారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమి చెందిన నేపథ్యంలో వైసిపి నాయకుల్లో, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపడానికే జగన్ పిలుపుచేశారని స్థానిక నాయకులు చెబుతున్నారు.

ఘనంగా బోనంగి పండు పడాల్ జయంతి

ప్రజాశక్తి -మధురవాడ : ఆదివాసి ఉద్యమ నేత బోనంగి పండు పడాల్ జయంతిని రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణా భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోనంగి పండు పడాల్ చిత్రపటానికి గిరిజన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మంద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులు అనుభవిస్తున్న దయనీయ స్థితిని తొలగించి వారి జీవితాల్లో వికాసం, అభ్యుదయం కలిగించడానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతో కలిసి అనేక పోరాటాల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

పాండ్రంగిలో పొలంబడి

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంఇఎస్.సలాం ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభం సాధించవచ్చని, ఎరువులు, పురుగుమందులు యాజమాన్య పద్ధతిలో వాడాలని రైతులకు సూచించారు. పొలంబడికి ఎంపికైన రైతులకు 50 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీచేశామని తెలిపారు.

పొలం బడిలో పాల్గొన్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రైల్లో తస్కరణ.. స్టీల్ ప్లాంట్లో ప్రత్యక్షం

ప్రజాశక్తి-ఉక్కునగరం : రైలు ప్రయాణంలో పోయిన బ్యాగు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం ప్రత్యక్షమైంది. దీనికి సంబంధించిన వివరాలిలావున్నాయి... చెన్నైకి చెందిన కార్తికేయన్‌కు హైదరాబాదులో ప్రైవేట్ ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం కోసం అతను వెళ్లే ప్రయత్నంలో ఈ నెల 8వ తేదీన శబరి ఎక్స్‌ప్రెస్‌లో కాట్పాడి నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరాడు. ఆ రాత్రి ట్రైన్‌లో ఒక యువకుడు అతని పక్కన కూర్చొని కొద్దిసేపు మాట్లాడాడు. తర్వాత పడుకున్నారు. రాత్రి ఒంటిగంట, రెండు గంటల మధ్యలో కార్తికేయన్ చూడగా బ్యాగ్ లేదు. పక్కన ఉన్న అబ్బాయి కనిపించలేదు. దీంతో కార్తికేయన్ ఒంగోలు స్టేషన్‌లో దిగి రైల్వే పోలీసులకు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడి నుంచి సికింద్రాబాద్ వెళ్లి అక్కడ కూడా ఫిర్యాదు చేశాడు. బ్యాగులో నగదుతో పాటు ల్యాప్‌టాప్, సర్టిఫికెట్లు, క్రెడిట్ కార్డు, ఏటిఎం కార్డు ఉన్నాయి.

బ్యాగ్ దొంగిలించిన వ్యక్తి అందులో ఉన్న నగదు రూ.3000 తీసుకొని బ్యాగును పక్కన ఉన్న గూడ్స్ ట్రైన్‌లోకి విసిరేసినట్లు తెలుస్తుంది. ఆ గూడ్స్ ట్రెయిన్‌ఉత్పత్తులు కోసం విశాఖ స్టీల్‌ప్లాంట్ వచ్చింది. ప్లాంట్‌లోని సిడిపై యార్డ్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు దామోదర్, తుకారాం, గజేంద్ర లోడింగ్ సమయంలో ఆ బ్యాగు చూసి తెరిచారు. అందులో ల్యాప్‌టాప్, సర్టిఫికెట్లు, కార్డులు కనిపించాయి. అందులోని ఆధార్ కార్డు ఆధారంగా కార్తికేయతో ఫోన్లో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్‌కు ఆ బ్యాగును అప్పగించారు. ఆ బ్యాగ్‌ను అయోధ్యరాం హైదరాబాద్ పంపించే ఏర్పాటుచేస్తున్నారు. ఈ విషయం తెలిసిన కార్తికేయన్ ఎంతో సంతోషం వ్యక్తంచేశారు. బ్యాగును అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

అయోధ్యరామ్‌కు బ్యాగును అందిస్తున్న కార్మికులు

వెల్లంకిలో ఇంటింటి కుళాయి పనులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి గ్రామపంచాయతీలో జల జీవనమిషన్ ద్వారా రూ.41.2 లక్షలతో ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వెల్లంకి గ్రామంలో సుమారు 350 ఇళ్లకు మంచినీరు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్ఎస్ఆర్.మూర్తి తెలిపారు. ఈ మేరకు గ్రామ వీధుల్లో పైపులైన్లు అమరుస్తున్నారు. సుమారు మూడు నెలల్లో పనులు పూర్తిచేసి ఇంటింటికీ ట్యాప్‌లు బిగించి స్వచ్ఛమైన నీటిని అందిస్తామని ఎఇ పేర్కొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నగేష్‌కుమార్

'ఇంజినీరింగ్ విద్యతో అపార అవకాశాలు'

ప్రజాశక్తి -తగరపువలస : ఇంజినీరింగ్ విద్య ద్వారా అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నట్లు నిపుణులు పేర్కొన్నారు. 'ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్య - అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి ఓ దృక్పథం' అంశంపై మంగళవారం స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురానికి చెందిన జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జివి.నగేష్‌కుమార్ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యలో ముందున్న సవాళ్లు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఎంచుకున్న రంగంలో పట్టు పెంచుకోవాలని ఇఇఇ విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.శశిధర్ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా గ్రామదేవతల పండగ

ప్రజాశక్తి-సింహాచలం : సింహగిరి కొండపై ఉన్న గ్రామ దేవతలు ఉమామహేశ్వరి పాదాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండగను మంగళవారం పులివేషాలు, తీన్మార్ డప్పులు, నాద స్వరాలతో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు, సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారి పిల్లా శ్రీనివాసరావు, ఎఇ హరి, పిఆర్ఒ నాయుడు తదితరులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం తరపున పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలను అమ్మవారికి ఆలయ ఇఒ శ్రీనివాస్‌మూర్తి దంపతులు సమర్పించారు. ఈ పండగను పురస్కరించుకొని మధ్యాహ్నం మూడు గంటల నుంచి అప్పన్న స్వామి దర్శనాలు నిలుపుదల చేశారు.

ముగిసిన జాతీయ చౌక్‌బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పాలవలస గ్రామం అసెంట్ స్కూల్ వేదికగా జాతీయ స్థాయి చౌక్ బాల్ బాలిక, బాలుర ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు సెప్టెంబర్ 22న రాజస్థాన్ జోధపూర్‌లో మొదలయ్యే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని అసెంట్ స్కూల్ పిఇటి కమ్ విశాఖ జిల్లా చౌక్ బాల్ సెక్రటరీ గాదిపల్లి సురేష్ తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పిఇటిలు సురేష్, శివాజీ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ చౌక్ బాల్ సిఇఇ ఒ.శివరాం, జనరల్ సెక్రటరీ సుధాకర్ రావు, అసెంట్ స్కూల్ చైర్మన్ శంకరరావు, డైరెక్టర్ బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటు చేశారు.. ప్రారంభం మరిచారు...

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ ఇచ్చాపురం గ్రామస్తులు ఫోన్ సౌకర్యం లేక ఆధునిక ప్రపంచానికి దూరంగా బతుకుతున్నారు. ట్రైబల్ ఏరియా అయిన ఈ గ్రామంలో సుమారు 50 కుటుంబాలు జీవిస్తున్నాయి. కొండ ప్రాంతాల నడుమ నివసిస్తున్న ఈ గ్రామాన్ని శాసనసభ ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యటించారు. ఆ సమయంలో గ్రామస్తులకు సెల్‌ఫోన్ సౌకర్యం కల్పించేందుకు టవర్‌ను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు బిఎస్ఎన్ఎల్ టవర్ కూడా ఏర్పాటు చేశారు. ఎన్నికల అనంతరం సెల్ టవర్ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ సెల్ టవర్‌ను వినియోగం తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విశాఖలో తంగలాన్ సినిమా ప్రమోషన్ టూర్

సినీ హీరో విక్రమ్ సందడి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హీరో విక్రమ్ తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : తంగలాన్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా సినీ హీరో విక్రమ్, హీరోయిన్ మాళవిక మోహనన్, నిర్మాత జ్ఞానవేల్ రాజా మంగళవారం విశాఖలో సందడి చేశారు. నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. హీరో విక్రమ్ 'తంగలాన్'తో ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని రంజిత్ తెరకెక్కించారు. నీలం ప్రొడక్షన్స్, స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్, పశుపతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానున్న నేపథ్యంలో ప్రచార పర్వాన్ని చేపట్టారు. ఈ క్రమంలోనే వారు విశాఖకు వచ్చారు. స్వాతంత్ర్యానికి పూర్వం కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన వాస్తవ సంఘటనల్ని ఆధారం చేసుకుని ఈ చిత్రం తెరకెక్కించారు. ఈ సినిమాకు సంగీతం జివి.ప్రకాష్‌కుమార్, ఛాయాగ్రహణం ఎ.కిశోర్‌కుమార్ సమకూర్చారు. ఈ సినిమాలో విక్రమ్ డిఫరెంట్ రోల్‌లో కనిపించనున్నారు. సినిమాను తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. 2022లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ చెన్నై, హైదరాబాద్, మధురై, కర్ణాటక సహా పలు లోకేషన్లలో చిత్రీకరించారు.

ఘనంగా హిచ్‌కాక్ జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ సినీ దర్శకుల్లో మేటి దర్శకుడైన హిచ్ కాక్ 125వ జయంతిని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హిచ్ కాక్ చిత్రపటానికి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఎస్.కె.మిశ్రో పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, 18, 19శతాబ్దాల్లో మంచి సినిమాలు అందించారన్నారు. అందుకే ఆయన మాస్టర్ ఆఫ్ సస్పెన్స్‌గా పేరుగాంచారని తెలిపారు. ఆయన ప్రపంచ సినిమా అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనిన్నారు. ఆయన గొప్పతనం నేటి యువ దర్శకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ జయంతిని జరిపినట్లు తెలిపారు. వేడుకలలో భాగంగా ఆయన దర్శకత్వంలో 1963లో వచ్చిన ది బర్డ్స్ ఇంగ్లీష్ సినిమాను ప్రదర్శించారు. నాటి పెట్టుబడి దారి సమాజంలో రసాయనిక పరిశ్రమల వల్ల పర్యావరణానికి, పక్షులకు ఆపద కలగడంతో పక్షులు ప్రతిఘటించిన అంశాలను కళ్లకు కట్టినట్లు చూపారు. చివరగా చిత్రంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావురెడ్డి, గుప్త తదితరులు పాల్గొన్నారు.

బిసి కులగణన నిర్వహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసి కుల గణన నిర్వహించాలని విశాఖ జిల్లా బిఎస్‌పి అధ్యక్షులు పెదపెంకి శివప్రసాద్ డిమాండ్ చేశారు. సీతమ్మధారలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో కులగణన నిర్వహించి బీసీలకు జనాభాను బట్టి పార్లమెంట్, అసెంబ్లీలో సీట్లు రిజర్వ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన నిర్వహించి స్థానిక సంస్థలలో, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య ఉద్యోగాలు, ప్రమోషన్లలో బీసీ జనాభాను బట్టి రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, బేమరిశెట్టి విశ్వనాథం, అరుగుల ధనుంజయరావు, నందికోళ్ల అప్పారావు, సవరాల రమేష్, శరత్ ప్రకాష్, నారాయణ పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిని జూనియర్ సివిల్ జడ్జి పి.నాగేశ్వరరావు మంగళవారం సందర్శించారు. విద్యాలయంలో ఉన్న తరగతి గదులను, డార్మిటరీలను, వంట గది, పరిసరాలను పరిశీలించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగి ఉండాలని విద్యార్థినులకు సూచించారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

వంటపాత్రలు కడగలేదని కుమార్తెపై దాడి

ప్రజాశక్తి-పెందుర్తి : వంట పాత్రలు కడగలేదని కుమార్తెను తల్లి చితకబాదిన ఘటన పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెందుర్తి పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి 96వ వార్డు పరిధి సింహాద్రినగర్‌లో బాలిక వంట పాత్రలు కడగలేదని తల్లి స్వాతి మంగళవారం తీవ్రంగా కొట్టింది. నిత్యమూ ఇదేమాదిరిగా కొడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బాలిక ఇబ్బందులను చూశారు. బాలికను వైద్య చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. తల్లి స్వాతిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్వాతికి వివాహమై గతంలో విడాకులు తీసుకోవడంతో బాలిక తల్లి వద్దనే ఉంటుంది. స్వాతి ఒక ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. రోజూ పని చేయడంలేదని పిల్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తుందని స్థానికులు చెబుతున్నారు.

అనుభవం ఉన్న డ్రైవర్లతో బస్సులు నడిపించాలి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రయివేట్ పాఠశాలలకు చెందిన బస్సులకు అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా తీసుకొని నడిపించాలని ఎంపిపి రాంబాబు సూచించారు. ఎంఇఒ-2 బాబూలాల్‌తో ఎంపిపి రాంబాబు మంగళవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రయివేట్ పాఠశాల బస్సుల ద్వారా ఆ పాఠశాలలో చదువుతున్న చిన్నపిల్లలకు ఏటా ఏదో ఒక ప్రమాదం జరుగుతుందని, తల్లిదండ్రులు పిల్లలను కోల్పోవడమో, అంగవైకల్యానికి గురికావడంతో జరుగుతుందని వివరించారు. ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలతో ఏడాదిలో ఒకటి, రెండుసార్లు మండల స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి బస్సులపై సమీక్ష నిర్వహించాలని ఎంఇఒకు రాంబాబు సూచించారు.

5 ప్రయివేటు బస్సులపై కేసులు

ప్రజాశక్తి -ఆనందపురం : నిబంధనలు ఉల్లంఘించిన ఐదు ప్రయివేటు బస్సులపై కేసు నమోదు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మంగళవారం దుక్కవానిపాలెం టోల్‌గేటు వద్ద నిర్వహించిన తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా సరుకులను తీసుకువెళ్తున్న ఐదు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గత వారం రోజులుగా తనిఖీలు చేసి నిబంధనలను ఉల్లంఘించిన 10 ప్రయివేటు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. స్కూలు బస్సులు, ఆటోలపై కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఆనందపురం, గాజువాక, మద్దిలపాలెం, పెందుర్తి, భీమిలి, తగరపువలస ప్రాంతాలలో మంగళవారం వరకు 95 కేసులు నమోదు చేసి, 9 బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. 46 ఆటోలపై కేసులు నమోదు చేసి ఐదింటిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో మోటారు వాహన తనిఖీ అధికార్లు బి.బాలాజీరావు, మాధవి, రాజారావు, కె.శ్రీనివాస్, ఎఎంవిఐలు పి.శిరీష, సుమన్‌కుమార్, అనిల్ కుమార్, శ్రీనివాస్ యాదవ్, దుర్గా ప్రసాద్, పార్వతి, కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొండలు కనుమరుగు

- శిఖరం వరకు చదును
- రాకపోకలకు రహదారి ఏర్పాటు
- ఆ పై పండ్ల మొక్కలు సాగు
- డి.పట్టాలు పొందేందుకు ప్రయత్నం

కొండ శిఖరం వరకు చదును చేసి, రోడ్డు వేసి మామిడి మొక్కలు నాటిన దృశ్యం

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం లోపూడి రెవెన్యూ పరిధిలోని కొండలు కనుమరుగవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ పెద్దల అండదండలతో దర్జాగా కొండలను కబ్జా చేశారు. వాటిని జెసిబితో చదును చేసి ప్రకృతి విధ్వంసానికి పాల్పడ్డారు. వారి భూదాహానికి పచ్చని కొండలు పిండయ్యాయి.

లోపూడి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 227లో కొండ బంజరు భూములు ఎక్కువగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో లోపూడి గ్రామానికి చెందిన కొంతమంది కొండలను జెసిబిలతో తవ్వి చదును చేయించారు. కొండ చివర వరకు వెళ్లేందుకు ఏకంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. శిఖర భాగాన్ని సైతం చదును చేయించారు. సాగుకు అనుకూలంగా మార్చారు. అక్కడ చిన్న చిన్న పాకలు వేసి సుమారు 5 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటారు. నాటి అధికార పార్టీకి చెందిన పెద్దల సహకారంతో పట్టాలు పొందేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ఇంతలోనే ఎన్నికలు రావడంతో ఆ ప్రయత్నాలు ఆగాయి.

ఈ ప్రాంతంలో ఎకరా భూమి విలువ రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల ధర పలుకుతుంది. 20 ఏళ్లు పైబడిన డి పట్టా భూములకు వైసిపి ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పించడంతో వీటి విలువ మరింత పెరిగింది. చాలామంది ఈ ప్రాంతంలో డి పట్టా భూములను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో కొండలను సైతం చదును చేసి సాగు భూములుగా చూపించి పట్టాలు పొందేందుకు ప్రయత్నాలు చేశారు. వీటిపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో కొండలన్నీ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కొండలను చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్ తదితరులు

నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20న "జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం" జరుగుతున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 1 నుండి 19 సంవత్సరం గల బాల బాలికలకు అంగన్వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు, పాఠశాలలకు వెళ్లని వారు, కౌమార బాల బాలికలకు నులిపురుగుల నిర్మూలన నిమిత్తం ఆల్బెండజోల్ మాత్రాలను అన్ని విద్యా సంస్థల్లో, అంగన్వాడీ కేంద్రాలలో ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ మాత్రలు 1 నుండి 2 సంవత్సరాలు వయసు గల పిల్లలకు సగం మాత్రను నీటిలో కరిగించి తాగించాలని, 2 నుండి 3 సంవత్సరాల వయసు గల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలని, 3 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయసు గల వారికి పూర్తి మాత్రను చప్పరించేటట్లు చూడాలని కోరారు. మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తరవాత మాత్రలను వేసుకోవాలన్నారు.

వరి ఆకు మడిని తడుపుతున్న రైతు

వర్షాల్లేక ఎండుతున్న వరినారు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వర్షాలు లేక వరి నారు ఎండిపోతుంది. దీంతో వరి ఆకుమడులను వ్యవసాయ మోటార్లు, బోర్ బావుల నీటిని ఇంజన్ల ద్వారా తడుపుతూ వరి ఆకులను రైతులు కాపాడుకుంటున్నారు. గత రెండు రోజులుగా ఎండలు విపరీతంగా కాస్తుండడంతో వరి ఆకులు ఎండి పోతున్నాయి. దీంతో ఆకు మడులను కాపాడుకోవడానికి రైతుంగా నానా పాట్లు పడుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం

చర్చాగోష్టిలో పాల్గొన్న యుటిఎఫ్, ప్రజా సంఘాల ప్రతినిధులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో సామాన్యులకు ఒరిగిందేమీ లేదని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై అచ్చుతాపురంలో మంగళవారం చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్లకు లాభసాటిగా ఉండే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని చెప్పారు. నష్టాల ఊబిలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు మద్దతు ధర తదితర వాటిపై స్పష్టత లేదని తెలిపారు. ఇన్సూరెన్స్‌పై జిఎస్టి వేయడం సామాన్య ప్రజల్లో బీమాను దూరం చేసే విధంగా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్‌పై జిఎస్టి వేయడం దుర్మార్గమన్నారు. లగ్జరీ వస్తువులపై జిఎస్టి తగ్గించడం ఎవరికి లాభసాటిగా ఉంటుందని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సరైన కేటాయింపులు చేయలేదని ఆవేదన చెందారు. ఆంధ్ర రాష్ట్రానికి కేటాయింపుల్లో ఆశించినంతగా ఏమీ లేదన్నారు. రాజధాని నిర్మాణానికి రుణం ఇప్పిస్తామని ప్రకటించడం మినహా అంతకుమించి ఏమీ కేటాయింపుల్లో లేవని తెలిపారు. ఈ చర్చ గోష్టి కార్యక్రమంలో ప్రజాసంఘాల ప్రతినిధులు కాండ్రేగుల రామ సదాశివరావు, కర్రి అప్పారావు, జిఎస్ ప్రకాష్, కె సోమునాయుడు, నారాయణమ్మ, జయలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలోని జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సి, పిహెచ్‌సిల్లో పని చేస్తున్న శానిటేషన్, చెద పురుగులు, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులకు పెండింగు జీతాలు తక్షణమే చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. లేకుంటే సెప్టెంబర్ 1నుండి దశలవారీగా ఆందోళనలు చేపడుతామని, 15నుంచి విధులను బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో డిసిహెచ్ అధికారి శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ ఈరోజుల్లో ఒక్కరోజు అద్దె పెండింగ్లో ఉన్నా ఇల్లు ఖాళీ చేయమంటున్నారని, చాలీచాలని జీతాలతో బతుకు నడపడం చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు మంజూరు చేయకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ఎస్ సంతోష్, నూకరాజు, అడవిరాజు, వై. రాజలక్ష్మి, ఈశ్వరరావు, మర్రా లక్ష్మి, బి. దుర్గ, ఎన్. లక్ష్మి, అరుణ, నర్సీపట్నం, కోటవురట్ల, యలమంచిలి, చోడవరం, మాడుగుల, కోటపాడు, నక్కపల్లి తదితర ఆసుపత్రుల కార్మికులు పాల్గొన్నారు.

జోగి రమేష్ అధికార దుర్వినియోగం

ప్రజాశక్తి-అనకాపల్లి

మాట్లాడుతున్న నాగజగదీష్

మాజీ మంత్రి జోగి రమేష్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ మంత్రిగా ఉన్నప్పుడు అధికారాన్ని దుర్వినియోగం చేసి అగ్రిగోల్డ్ సిఐడి అటాచ్‌లో ఉన్న సర్వే నెంబర్ 88లో 2160 గజాల భూమిని జోగి రమేష్ కుమారుడు జోగి రాజు, బాబాయి జోగి వెంకటేశ్వరరావు పేర్ల మీద కొనుగోలు చేశారని ఆరోపించారు. వాస్తవానికి కొనుగోలు చేసిన భూమి రికార్డులు తారుమారు చేసి సర్వే నెంబరు 87లోకి మార్చివేసి 10 కోట్లకి అమ్మేశారని తెలిపారు. దీనిపై అగ్రిగోల్డ్ భూములు అన్యాక్రాంతంపై అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదుపై పోలీసు అధికారులు సుదీర్ఘ విచారణ చేసిన తర్వాత జోగి రాజు పై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ భూమి సర్వేనెంబర్ మార్పు జరిగిన తర్వాత 2023లో పరిగిపాటి సుబ్బారావు కుటుంబ సభ్యులకు జోగి రమేష్ వారి బాబాయి వెంకటేశ్వరరావు విక్రయించడం జరిగిందని, ఈ సర్వే నెంబరు మార్పు విషయంలో ఆనాటి మంత్రిగా జోగి రమేష్ అధికార దుర్వినియోగానికి పాల్పడి అడుగు అడుగున రెవెన్యూ సిబ్బందికి రిజిస్ట్రేషన్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అగ్రిగోల్డ్ భూములను దోచుకున్నారని ఆరోపించారు. సిఐడి అధికారులు పక్కా విచారణ చేసి ప్రాథమిక ఆధారాలు సేకరించిన తర్వాతే ఏసీబీ అధికారులు నేడు జోగి రమేష్ ఇంటిపై దాడి చేశారన్నారు. దీనికి రమేష్ రాజకీయ రంగు పులిమి తనకు అన్యాయం జరిగిపోతున్నట్టు మీడియా ముందు కులప్రస్థానం తీసుకురావడం బాధాకరమన్నారు.

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆటల పోటీలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

చిన్నారులకు ఆటలు ఆడిస్తున్న సంఘాల నాయకులు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అనకాపల్లి చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కె.సంతపాలెం అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. జాతీయ గీతాల ఆలాపన, క్విజ్ పోటీలు, కప్పగంతులాట, పరుగు పోటీలు, కాలు గుంటాట తదితర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేముడు, రైతు సంఘం నాయకులు జి.నాయినిబాబు, కెవిపిఎస్ నాయకులు గాడి ప్రసాదు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు పి.భవాని, అంగనవాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రామస్వామి జనసేనలో చేరిక

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని పిఎన్ఆర్.పేట మాజీ సర్పంచ్ ఊటుకూటి చిన్నరామస్వామి వైసిపిని వీడి జనసేన పార్టీలో చేరారు. అచ్యుతాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయనకు ఎమ్మెల్యే విజయకుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాజాన శేషు, మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీనివాస్, ఎంపిటిసి నగిరెడ్డి అచ్చం నాయుడు, గోపిశెట్టి రాజు, పట్టణ జనసేన అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు నానాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో మాజీ సర్పంచ్ చినరామస్వామి

అమరావతి రాజధానికి రూ.30 వేలు విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి : చిల్డ్రన్స్ ఫిలిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను మంగళవారం కలిసి అమరావతి రాజధాని నిర్మాణానికి 30 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ యువి సంతోష్, సెక్రటరీ చలమల వెంకటేశ్వరావు పాల్గొని అనాథ పిల్లల ఆశ్రమాలకు దుప్పట్లు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తాకాసి కిషోర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న దృశ్యం

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

చిరంజీవి జన్మదిన వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పరవాడ

మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదిన వారోత్సవాల పోస్టర్‌ను చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మడక రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఈ నెల 22న చిరంజీవి జన్మదిన సందర్భంగా 16 నుండి 22వ తేదీ వరకు వారం రోజులు పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చివరి రోజు జన్మదిన సందర్భంగా పంచకర్ల రమేష్ బాబు చేతులమీదుగా లంకెలపాలెం జంక్షన్లో వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిల్లి శ్రీనివాసరావు, కె.వాసుదేవరావు, బంటికోరు గోవిందరాజు, రాఘవాపురపు శ్రీనివాస్ కుమార్, ముమ్మిని శ్రీనివాసరావు, బంటికోరు పెంటారావు, గొల్లవిల్లి నానాజీ, బొండా అచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ శేషు బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ఎన్నికల కోడ్ ఉన్నందున సమీక్ష ఉంటుందని, ఎటువంటి తీర్మానం వుండవని పేర్కొన్నారు.

యువకుడికి పాము కాటు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గ్రామానికి చెందిన శాంటెన్ (19) సోమవారం రాత్రి హైస్కూల్ వద్ద పాముకాటుకు గురయ్యాడు. ఆయన తండ్రి శ్రీను హైస్కూల్ నైట్ వాచమెన్‌గా శ్రీను పనిచేస్తున్నారు. తన తండ్రి కోసం వచ్చిన శాంటెన్ పాము కాటుకు గురయ్యాడు. హుటాహుటి ఆయన్ను నా చికిత్స కోసం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యం పొందుతున్నారు.

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ ముకుందరావు కోరారు. పట్టణంలో హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ఆదేశాల్లో భాగంగా ఈనెల 2 నుంచి 13 వరకు ఈ కార్యక్రమం నిర్వహించమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ చదరంగం, క్యాంప్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చారుమతి, డాక్టర్ జి కుసుమ, వార్డెన్ డి ఉమామహేశ్వరరావు, శాస్త్రవేత్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ

ఘర్ ఘర్ కా తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనకాపల్లి జీవీఎంసీ 80వ డివిజన్‌లో కూటమి పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మారిశెట్టి భాస్కరరావు, బొడ్డేడ జోగినాయుడు, బొడ్డేడ మురళి, రమణ, శ్రీనివాసు మల్లేశ్వరరావు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, అధికారులు

భూ అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు

- రెవెన్యూ సదస్సులతో సమయం వృథా
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

భూ అక్రమాలు జరిగాయని ఆధారాలతో సహ ప్రజలు చూపిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గతంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలు ఎన్ని పరిష్కారమయ్యాయో ఇప్పుడు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ప్రజలకు తెలియజేస్తారా? అని ప్రశ్నించారు. దేవరాపల్లిలోని సర్వే నెంబరు 20లో 38 ఎకరాలు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు తీర్పు ఇవ్వగా, రెండేళ్లయినా భూములను స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. వి.మాడుగుల మండలం ఉరలోవకొండ చుట్టు దాదాపుగా 450 మందికి 12 ఏళ్ల క్రితం ప్రభుత్వం అసైన్డ్ చేసి డి-పట్టాలు ఇచ్చిందని, నాటి నుండి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని, కనీసం సర్వే నెంబరు కూడా సక్రమంగా వేయలేదని పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా పేదలు సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు అసైన్డ్ చేసి పట్టాలు ఇప్పించాలని వందలాది మంది దరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా పై సమస్యలను పరిష్కరించగలరా? అని ప్రశ్నించారు. దేవరాపల్లి, చీడికాడ, వి.మాడుగుల, రావికమతం రోలుగుంట, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల మండలాల్లో ఆదివాసీ గిరిజనుల సాగులో ఉన్న వందలాది ఎకారాల ప్రభుత్వ భూములను 99 సంవత్సరాల లీజులు పేరుతో పెద్దలు రాయించుకున్నారని, ఈ రెవెన్యూ సదస్సులో 9/77 యాక్టు ప్రకారం ఆ భూములు తిరిగి ఇప్పిస్తారా? అని ప్రశ్నించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, మండల కేంద్రాల్లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీలను పరిష్కరించడం లేదన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు దరఖాస్తులు పెట్టుకుంటే రశీదులు ఇచ్చి కాలవ్యవధిలో పరిష్కారం చేస్తామని ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటూ ముప్పు తిప్పలు పెడుతున్నారన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల వల్ల సమయం వృథా తప్ప మరొక్కటి కాదని పేర్కొన్నారు.

వాటర్ ట్యాంకును పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకొని ప్రమాద స్థాయిలో ఉందని, దానిని వెంటనే పునర్నిర్మించాలని నియోజకవర్గ తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిమి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వాటర్ ట్యాంకును ఆయన పరిశీలించి, అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలు క్రితం వాటర్ ట్యాంక్ నిర్మించారని, ట్యాంకు కాలపరిమితి అయిపోవడంతో శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. ట్యాంకు పెచ్చులూడిపోవడంతో అధికారులు మరమ్మతులు చేసిన ఫలితం లేకపోతుందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉందని తెలిపారు. ప్రమాదం జరగకముందే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకును చూపుతున్న నాగేశ్వరరావు

కళాశాల బాలుర హాస్టల్ సమస్యలపై ఆందోళన

ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలోని ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. ఎస్సీ కాలేజీ హాస్టల్ భవనాలు చాలా పాతబడి కారిపోతున్నాయని తెలిపారు. 1980లో ఈ హాస్టల్ నిర్మించారని, ఉన్న రూముల్లో రెండు రూములు పూర్తిగా పాడైపోయాయని, ఒక రూమ్ వర్షం పడితే కారిపోతుందని చెప్పారు. కిటికీలు, తలుపులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో విద్యార్థులు పడుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, దోమల బెడద ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్, నాయకులు ఎ.మౌనిక, అఖిల్, పి.రామకృష్ణ, చంటి, రామ్ చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేయడం తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ దరఖాస్తుదారునికి గడువులోగా పూర్తి సమాచారాన్ని ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం పట్ల రాష్ట్ర సమాచార కమిషన్ (ఆర్టీఐ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దరఖాస్తుదారుల్ని ఇబ్బందులకు గురి చేయడం తగదంటూ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాంగ్రేగుల వెంకటరమణ 2019 ఏప్రిల్ 1 నుంచి సమాచారం ఇచ్చు తేదీ వరకు జారీ చేసిన ప్రకటనలు, ప్రసార మాధ్యమాల పేర్లు, ప్రకటనల విలువ, ఆర్‌వోలు, చెల్లింపులు, బకాయిల వివరాలు, ప్రసార మాధ్యమాల ఎంపానల్‌మెంట్ నియమావళి కోసం 2022 నవంబర్ 16న రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖకు దరఖాస్తు చేశారు. దీనికి అధికారులు పూర్తి స్థాయిలో స్పందించలేదు. దీంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆయన ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా వర్చువల్ విధానంలో విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారు కోరిన పూర్తి సమాచారాన్ని వచ్చే నెల 19లోగా అందజేయాలని, అంతవరకు అప్పీలును ముగించేది లేదని స్పష్టం చేశారు. విచారణలో రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు, అర్జీఐ పునర్విచారణాధికారి పోతల కిరణ్‌కుమార్, ప్రజా సమాచార అధికారి బి.పూర్ణచంద్రరావు, అప్పీలుదారు కాంగ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌కు ఆత్మీయ వీడ్కోలు సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి

తెనుగుపూడి బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చందక రవీంద్రనాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. రవీంద్రనాథ్, సత్యవతి దంపతులను డిసిఓ ఎస్.రూపవతి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, అధ్యాపక సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిసిఒ రూపవతి మాట్లాడుతూ రవీంద్రనాథ్ అజాత శత్రువని పేర్కొన్నారు. నాలుగు తరాల కుటుంబ సభ్యుల మధ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం చేయడం ఆయన అదృష్టమన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు దేముడు, ఎలక్ట్రీషన్ చంద్రశేఖర్, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుడు ముత్యాల నాయుడు సేవలను గుర్తించి వారిని రవీంద్రనాథ్ సత్కరించారు.

15న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -అనకాపల్లి : శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, రాజా ఆప్టికల్ అండ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో అనకాపల్లి ఎఎంఎఎల్ హై స్కూల్లో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15వ తేదీన మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందని రాజా ఆప్టికల్స్, కంటి ఆసుపత్రి అధినేత పూసర్ల రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరంలో కంప్యూటర్లపై కంటి వైద్య నిపుణులతో కంటి పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కంటిపై వచ్చే కండ, మెల్లకన్ను సరిచేయుట, 14 సంవత్సరముల లోపు పిల్లలకు క్యాటరాక్ట్(శుక్లం), షుగర్ వ్యాధిగ్రస్తులకు వచ్చే కంటి నరం వ్యాధులకు, కంటి గుడ్డికి సంబంధించిన కొన్ని వ్యాధులకు, నల్లగుడ్డు మార్పిడి వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయబడునని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు తొలగించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులోని దిగువ యాతపేటకు సమీపంలో గల శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి, శ్మశానానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. గ్రామంలోని కొంత భాగానికి చెందిన వెలమ, రజక, యాత, యాదవ కులస్తులు చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. ఇక్కడ స్మశానం అంత పిచ్చి మొక్కలతో నిండిపోయి మృతదేహాల్ని ఖననం చేసేందుకు గాని కాల్చుకునేందుకు గాని చోటు లేక మృతుల బంధువులు అష్ట కష్టాలు పడుతున్నారు. చుట్టూ పొలాలు ఉండడంతో కొందరు స్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించారని, స్మశానంలో బోరు కూడా పిచ్చి మొక్కలతో నిండి పోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి స్మశానంలోని పిచ్చి మొక్కలను ఆక్రమణలను తొలగించి చనిపోయిన వారికి సక్రమంగా అంత్యక్రియలు నిర్వహించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటిలో బోరుబావి చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి
బుధవారం 14 ఆగస్టు 2024

15న గ్రూప్ డ్యాన్స్, ఏకపాత్రాభినయ పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 78వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15 ఉదయం 10.30 గంటల నుండి రోజంతా డాబా గార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా విద్యార్థులకు,యువతీ యువకులకు గ్రూప్ డ్యాన్స్ పోటీలు, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలను స్కూల్స్, జనరల్ డ్యాన్స్ క్లబ్బులు, డ్యాన్స్ అకాడమీలు మూడు కేటగిరీలుగా నిర్వహించి, ప్రతి గ్రూపు నుంచి ఐదుగురికి ఉత్తమ బహుమతులు ఇస్తామన్నారు. ఇందులో ప్రదర్శించే కళారూపాలు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యత, దేశభక్తి, అభ్యుదయ భావాల ఇతివృత్తాలతో ప్రదర్శించాలని తెలిపారు. అలాగే ఇదే వేదికగా ఔత్సాహిక గాయకులతో దేశభక్తి గీతాలు ఆలపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోటీల్లో పాల్గొన్న కళాకారులు, గాయకులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. గెలుపొందిన టీములకు,కళాకారులకు జ్ఞాపికలతో పాటు, యోగ్యతా పత్రాలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారంతా ముందుగా తమ పేర్లను ఫోన్ చేసి, వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్‌కు ఎటువంటి ప్రవేశరుసుము లేదని అధ్యక్షులు పి.వి.రమణ, సహాయకార్యదర్శి ఆర్. ఎస్.ఆర్ మూర్తి కోరారు. పూర్తి వివరాలకు 9490750661, 9247798787 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న వేదిక కార్యదర్శి నాగేశ్వరరావు

బొత్సను కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: వైసిపి విశాఖ ఉమ్మడి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను మంగళవారం నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ విషయాలను కొద్ది సేపు చర్చించారు.

బొత్సను అభినందిస్తున్న గణేష్

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

విద్యుత్ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న వేదిక ప్రతినిధులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి విద్యుత్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ సబ్ డివిజన్ నుంచి 15 సమస్యలతో వినియోగదారులు రాగా ఈ కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ జడ్జి, ఛైర్పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ వినతులు స్వీకరించారు. ఆయా అర్జీలను రిజిస్ట్రేషన్ చేయించి, వారికి రశీదులు ఇచ్చారు. బాధితుల సమస్యలు పరిష్కరించేందుకే ఈ వేదిక నిర్వహించారని, అందరి సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో సభ్యులు(ఆర్థిక) ఎం.శ్రీనివాస్, సభ్యులు(సాంకేతిక) బి.జనార్దన్‌రావు, నర్సీపట్నం డిఇ విడివి.రామకృష్ణ, డిఇఇ ఎస్.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గొడిచెర్ల పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ బాలాజీ

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల స్టాక్ రూమును పరిశీలించారు .రికార్డులను తనిఖీ చేసారు. వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు .సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు .గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు .

జానకయ్యపేటలో విస్తృతంగా వైద్యసేవలు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని జానకయ్యపేటలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ టీం పర్యటించింది. గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు హెచ్‌బి టెస్ట్ నిర్వహించారు. ఈ మేరకు టాస్క్ ఫోర్స్ టీం శిబిరాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రక్తహీనత లోపించకుండా అవగాహన కల్పించాలని సూచించారు .పోషకాహారం తీసుకోవాలన్నారు. మాత శిశురక్షణ కార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.
సీజనల్ వ్యాధుల నివారణపై వైద్యులు, వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గ్రామాల్లో దోమలు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుకన్య, కిరణ్ ప్రసాద్, శ్రావణి సంధ్య, వైద్య సిబ్బంది యువిఎస్ రావు పాల్గొన్నారు .

గ్రామంలో పర్యటిస్తు జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇ- పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని రమాదేవి కోరారు మండలంలో 13 రైతు సేవ కేంద్రాలలో వాటి పరిధిలోని గ్రామాలలో రైతులందరూ ఈ పంట నమోదు ద్వారా ప్రభుత్వం అందించే వ్యవసాయ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలని సూచించారు. అంతేకాకుండా రైతులకు ప్రభుత్వం అందించే వరి విత్తనాలను సబ్సిడీకి పొందాలన్నా, ధాన్యాలను రైతు సేవ కేంద్రం ద్వారా అమ్మాలన్నా ఈ పంట నమోదు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, హార్టికల్చర్ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

పరిహారం చెల్లించిన వాటికే ఫొటోలు తీయాలి

డిటికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు , నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని చందనాడ గ్రామంలో వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఎపిఐఐసి అధికారులు సేకరించిన ఆస్తులకు మాత్రమే ఫోటోలు తీయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, సర్పంచ్ భర్త తళ్ల భార్గవ్, రైతు నాయకులు తళ్ల అప్పలస్వామి కోరారు. మంగళవారం నిర్వాసితులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వద్ద డిటి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. రైతుల మకాంలో ఉన్న పశువుల పాకలు, వర్మీ కంపోస్టులు లాంటివి కోల్పోతున్న రైతులకు గతంలో నష్టపరిహారం చెల్లించారన్నారు. ప్రస్తుతం ఏపీఐఐసీ ,రెవెన్యూ అధికారులు సంబంధిత రైతుల ఇళ్లకు ఫోటోలు తీస్తున్నారని, ఇలా చేయడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.నష్టపరిహారం చెల్లించిన వాటికి మాత్రమే ఫోటోలు తీసే విధంగా చర్యలు చేపట్టాలని డీటీని కోరారు .వినతిపత్రం అందజేసిన వారిలో టి.వెంకటరమణమూర్తి, టి సత్యనారాయణ మూర్తి, పలువురు మహిళలు ఉన్నారు.

రంగురాళ్ల క్వారీ సందర్శన

క్వారీ ప్రాంతాన్ని సందర్శిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని సాలికమల్లవరం రంగు రాళ్ల క్వారీని గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు మంగళవారం ఫారెస్ట్ అధికారులతో కలిసి సందర్శించారు. ఇక్కడ రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయనే సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో స్పందించి తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎస్ఐ కృష్ణారావు మాట్లాడుతూ రంగురాళ్ల తవ్వకాలకు ఎవరూ పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో దోమల నివారణకు మందు స్ప్రేయింగ్ చేస్తున్నారు. గ్రామంలో ఇంటింటి కుళాయిలు కోసం రోడ్లు తవ్విన రాళ్లు పక్కనున్న కాలువల్లోకి పడిపోవడంతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొన్ని చోట్ల కాలువలు మూసుకుపోయి నీరు వెళ్లక దుర్గంధం వెదజల్లుతుంది. దోమలు వృద్ధిచెంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు విషయాన్ని సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, కార్యదర్శి కోటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించి పారిశుధ్య సిబ్బందితో దోమల నివారణకు వాడే మలాథిన్, ఫినాయిల్ కలిపి అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాలలో పిచికారీ చేయించారు.

ఏలేరు కాలువ వంతెన సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలోని పాములవాక గ్రామంలో ఏలేరు కాలువపై రైతుల వినియోగానికై రూ.2.30 కోట్లతో నిర్మించిన వంతెన సమస్యను పరిష్కరించాలని జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌కు మండల టిడిపి నాయకులు వేచలపు భాస్కరరావు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇటీవల నిర్మించిన వంతెనపై నీరు నిలిచిపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు, హోంమంత్రి అనిత ఆదేశాల మేరకు సమస్యను జివిఎంసి కమిషనర్‌కు విన్నవించి, త్వరితగతిన పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నేతలు

సేంద్రియ ఎరువు తయారీపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి కోటవురట్ల: మండల వ్యాప్తంగా నిర్మించిన కంపోస్టు ఎరువుల నిర్వహణ కేంద్రాలను సద్వినియోగంపై శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలో లింగాపురం గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు, ఈ సందర్భంగా ఆమె గ్రామంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణతోపాటు కంపోస్ట్ ఎరువుల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. మండల వ్యాప్తంగా నిర్మించిన కేంద్రాల్లో కంపోస్ట్ ఎరువుల తయారీ పట్ల శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య, తాగునీరు నిర్వహణ తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కాశీ విశ్వనాథరావు, కార్యదర్శి వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ :స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎల్ పురం హైస్కూల్లో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేటలో పైపులైన్ లీకేజీతో తాగునీరు రోడ్డుపై పారుతోందని, దీన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.' మెయిన్ రోడ్డుపై రెండు రోజులుగా పైపులైన్ లీకేజీతో మంచినీరు వృథాగా పోతుందని, అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. తక్షణమే పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కణమాం ఆటోనగర్ నిర్మించాలి

ఎస్ఎంఎస్ఇ పార్కుకు అప్పగించే ప్రతిపాదన వద్దు : సిఐటియు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆనందపురం మండలం కణమాంలో ఎపిఐఐసి ద్వారా ఆటోనగర్ నిర్మాణం పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. ఆటోనగర్‌ను ఎంఎస్ఎంఇ పార్క్‌కు అప్పగించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కణమాంలో ఆటోనగర్ కోసం తీసుకున్న భూములకు ప్రభుత్వం నష్టపరిహారం చాలావరకు చెల్లించారని, ఇంకా కొంతమంది రైతులకు రూ. 11 కోట్లు పరిహారాన్ని సంబంధిత అధికారుల నిర్వాకంతో జాప్యం జరుగుతోందన్నారు.
దీంతో ఆటోనగర్ పనులు ప్రారంభించ లేకపోతున్నామని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఏడాదిగా చెబుతున్నారన్నా కార్మికులు ఎన్ని విన్నపాలు చేసినా ఫలితం దక్కలేదన్నారు .రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, పరిశ్రమలు ఏర్పాటుతో ఉద్యోగాలు వస్తున్నాయని, జిల్లా యంత్రాంగం ఆర్భాటపుఏ ప్రచారం చేస్తోందే గానీ,కణమాంలో ఆటో నగర్ నిర్మాణంపై చర్యలుగానీ, అక్కడి నిర్వాసిత రైతులకు మిగులు పరిహారం చెల్లించడం గానీ చేయడంలేదన్నారు. పదివేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఆటో పార్ట్స్, ఆటోమొబైల్ స్క్రాప్ రంగానికి భరోసాగావుండాలని రెండేళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా పరిశ్రమల యజమానులు జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల్లో కదలిక లేదన్నారు. తెలుగుదేశం హయాంలో ఆటోనగర్‌కు భూసేకరణ జరిగిందని వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని, కనీసం ఇప్పుడైనా మళ్లీ అధికారంలోకి వచ్చిన టిడిపి పట్టించుకోవాలని కోరారు..10 వేల కుటుంబాల నోట్లో మట్టి కొట్టే ఆలోచన టిడిపి ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు.
ఎంఎస్ఎంఈ పార్కు కోసం ఆటోనగర్ అప్పగిస్తే వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టి 50 కోట్లు టర్నోవర్ చేయాలన్న నిబంధన ప్రస్తుతం ఉన్న యాజమాన్యం వల్ల సాధ్యం కాదన్నారు. మల్టీ నేషనల్, కార్పొరేట్ కంపెనీలకు ఇస్తున్న రాయితీలకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న స్క్రాప్ రంగం పట్ల వివక్షత చూపడం అన్యాయమని, . తెలుగుదేశం ప్రభుత్వం ఈ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు సమావేశంలో సిఐటియు నాయకులు ఎం.ఖాన్,కె.సంతోష్,కెవిపి చంద్రమౌళి,ఎం.సమీర్ పాల్గొన్నారు.

మహనీయుల బాటలో పయనిద్దాం

బీచ్‌రోడ్డులో హర్ ఘర్ తిరంగా యాత్రలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: దేశం కోసం, స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని, వారిలాగే భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 9 నుంచి జరుగుతున్న హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం బీచ్ రోడ్డులో హర్ ఘర్ తిరంగా యాత్రను లో జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ పి. సంపత్ కుమార్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం యూసీడీ, ఐసీడీఎస్, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హర్ ఘర్ మేళాను తిలకించారు. విద్యార్థులు, అధికారులు, క్రీడాకారులతో కలిసి ప్రతిజ్ఞ చేసి ర్యాలీగా సాగారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ . దేశానికి స్వాతంత్ర్య సాధనకు కృషిచేసినవారి త్యాగాలను, సాహసాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సామాజిక సేవా దక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం అంకితభావంతో పని చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జిల్లా టూరిజం అధికారిణి జ్ఞానవేణి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, డీఎస్డీవో జూన్ గ్యాలియెట్, యూసీడీ పీడీ ఫణిరాం, డీఐపీఆర్వో ఎస్.వి. రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మానవత్వం బతికే ఉంది.!

అనాథ వృద్ధునికి సపర్యలు చేస్తున్న మతిస్థిమితం లేని మహిళ

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోటలో అస్వస్థతతో బాధపడుతున్న మతిస్థిమితం లేని వ్యక్తికి, మరో మతి స్థిమితం లేని మహిళ సపర్యలు చేసిన ఘటన మనుషుల్లోని మానవత్వం బతికే ఉందని మరోమారు నిరూపించిందని స్థానికులు అంటున్నారు అనారోగ్యంతో ఆఖరిదశలో ఉన్నాడని స్థానిక పోలీసులు, పంచాయతీ సిబ్బంది నిర్ధారణకు వచ్చిన సమయంలో కన్నంపేటకు చెందిన మరో మతి స్థిమితం లేని మహిళ అతనికి సపర్యలు చేసి ఊపిరిపోసింది. స్థానిక ఆటో యూనియన్ సభ్యులు సాయంతో హోటల్‌లోని ఇడ్లి, మెడికల్ షాపులో ఫ్రూటీ డ్రింక్స్ తీసుకువచ్చి అతనికి తినిపించి బతికించింది. అతనికి స్నానం కూడా చేయించింది. ఆరుబయట ఎండలో ఉన్న బాధితునికి సమీపంలోని నీడకు చేర్చింది. ఈ తంతునంతా చూసి పలువురు తమకేమీ పట్టనట్లు పక్కనుంచి జారిపోగా, ఇంకొందరు సోషల్‌మీడియాలో స్టేటస్‌లా పెట్టుకునే ందుకు, అప్‌లోడ్ చేసేందుకు సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారో తప్ప, బాధితులకు చేతనైన చేయాలన్న సామాజిక స్పృహ ఎవరికీ లేకుండా పోవడం విశేషం. ఇలాంటి తరుణంలో అనాథ మహిళా చేసిన సపర్యలు పలువురు ప్రశంసించ కుండా ఉండలేక పోతున్నారు. కొంత కాలంగా గ్రామంలో ముగ్గురు మతి స్థిమితం లేని వ్యక్తులు తిరుగు తున్నారు. ఒడిశా నుంచి ఇక్కడికి వచ్చి రోడ్డు ప్రమాదం వెన్ను పూసకు గాయం తగిలిన వ్యక్తి గత కొంత కాలంగా ఉంటున్నాడు అలాగే ఈ మధ్య కాలంలో కన్నం పేటకు చెందిన మహిళ కుటుంబం తగాధాలతో మతి స్థిమితం కోల్పోయి కొత్తకోటలో తిరుగు తొంది. అలాగే మరో మహిళ కూడా తిరుగు తొంది. వీరికి స్థానికులిచ్చి నవి తింటూ వీరు జీవనం సాగిస్తున్నారు.

నర్సీపట్నంలో హర్ ఘర్ తిరంగా

ర్యాలీ చేస్తున్న గ్రంథాలయ పాఠకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం శాఖా గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠకులు, యువతీ, యువకులు పాల్గొని భారత్ మాతాకి జై, భోలో స్వతంత్ర భారత్‌కి జై అనే నినాదాలతో ర్యాలీ చేశారు. గ్రంథాలయాధికారి దమయంతి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినూత్న నిరసన

కాగడాలతో నీళ్లబంద గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట : తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని రోలుగుంట మండలం అర్ల పంచాయతీ నీళ్లబంద గ్రామస్థులు మంగళవారం నిరసన చేపట్టారు. కాగడాలు వెలిగించి వినూత్నంగా తమ నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ఆరు కుటుంబాలు 25 మంది జనాభా ఉన్నామని, స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు కావస్తున్నా తమకు నేటికీ విద్యుత్ సౌకర్యం లేదన్నారు. ఇప్పటికైనా తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గెమ్మిలి సత్తిబాబు, జీ.అప్పారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

అభ్యుదయభావాలతో..
అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం
అనే నినాదంతో
44వ వసంతంలోకి
అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక
శుభాకాంక్షలు
గొట్టిపల్లి సత్యనారాయణ
ప్రధానోపాధ్యాయులు, ఎం.పి.యు.పి. స్కూల్,
కృష్ణంరాజుపేట, భీమునిపట్నం మండలం

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం
సమాభివృద్ధి కోసం
నిరంతరం కృషి చేస్తున్న
'ప్రజాశక్తి' దినపత్రికకు
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
ఉపాధ్యాయులు
GVMC
MFCUP SCHOOL
భీమునిపట్నం

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం
ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
44వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
పంచాయితీరాజ్
భీమునిపట్నం సబ్ డివిజన్
పిఆర్ఐ & పిఐయు

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో ప్రతి అక్షరం-ప్రజల పక్షం
అనే నినాదంతో 44వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
పట్టణ ప్రణాళిక విభాగం
జివియంసి జోన్-1
భీమునిపట్నం